క్లుప్తంగా

ఎరువుల దుకాణాల్లో తనిఖీలు



ఆలమూరులో రసాయన ఎరువుల బస్తాలను పరిశీలిస్తున్న అధికారులు

రుద్రవరం: మండల పరిధిలోని ఆలమూరులో ఉన్న ఎరువుల దుకాణాలపై మంగళవారం విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్ ఏఓ విశ్వనాథ్, స్థానిక వ్యవసాయాధికారి సుమతి కలిసి దాడులు నిర్వహించారు. రసాయన ఎరువులు, పురుగు మందులు అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో ఈ దాడులు చేసినట్లు వారు తెలిపారు. ఇందులో భాగంగా గ్రామంలోని మూడు దుకాణాల్లో తనిఖీలు చేసి రూ.298834 విలువ చేసే14.335 టన్నుల యూరియా, డీఏపీని సీజ్ చేసి 6ఏ కింద కేసు నమోదు చేసినట్లు వారు తెలిపారు.

చిరువ్యాపారుల వినతి

నంద్యాల(అర్బన్): పట్టణంలోని చిరువ్యాపారుల నుంచి రోజువారి గేట్ల వసూలును రద్దు చేయాలని చిరువ్యాపారుల సంక్షేమ సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు ఆకుమల్ల రహీం డిమాండ్ చేశారు. ఈ అంశంపై మంగళవారం ఆ సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్పర్సన్ మాబున్నిసాకు వినతి పత్రం ఇచ్చారు. అనంతరం ఆకుమల్ల రహీం మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో స్థానిక ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్రెడ్డి, అప్పటి మున్సిపల్ కమిషనర్తో చర్చించి చిరువ్యాపారుల కోరిక న్యాయమైనదేనని, గేట్ల రద్దును మున్సిపల్ కౌన్సిల్లో తీర్మానం చేయించారన్నారు. ప్రభుత్వ గెజిట్ను ధిక్కరిస్తూ ఇప్పుడు మున్సిపల్ అధికారులు గేట్లు వసూలు చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, మున్సిపల్ వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, మదార్వలి, కార్యవర్గ సభ్యులు నబీరసూల్, సాయి, గుర్రప్ప తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని మహిళ మృతి



మహిళ మృతదేహం

నంద్యాల(అర్బన్): నంద్యాల మండలం పోలూరు గ్రామం ఆర్టీసీ బస్ షెల్టర్లో 55 ఏళ్ల వయస్సు గల మహిళ మృతి చెందింది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మంగళవారం ఉదయం నంద్యాల నుంచి గడివేముల వైపు వెళ్లే ఆర్టీసీ బస్సు ఎక్కిన గుర్తు తెలియని మహిళ పోలూరు వద్ద బస్సు దిగింది. అక్కడి ఆర్టీసీ బస్సు షెల్టర్లో కూర్చొని కొద్దిసేపటికి ప్రాణాలు వదిలింది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు అక్కడికి చేరుకొని మహిళ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆచూకీ తెలిసిన వారు సెల్: 9121101092కు సమాచారం ఇవ్వాలని నంద్యాల తాలూకా పోలీసులు కోరారు.

ఐటీఐలో 4వ విడత ప్రవేశాలకు దరఖాస్తు

డోన్ టౌన్ : జిల్లాలోని ప్రభుత్వ,ప్రైవేట్ ఐటీఐల్లో మిగిలిపోయిన సీట్ల భర్తీ కోసం ఈ నెల 16 నుంచి 27వ తేదీ వరకు 4వ విడత ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కన్వీనర్, డోన్ ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ప్రసాద్రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కల్గిన అభ్యర్థులు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకొని 28వ తేదీ లోపు సమీప ప్రభుత్వ ఐటీఐలో ఒరిజినల్ సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు. 29న ఉదయం 9 గంటల నుంచి ప్రభుత్వ ఐటీఐల్లో, 30న ప్రైవేట్ ఐటీఐల్లో జరి గే కౌన్సెలింగ్కు హాజరుకావాలని కోరారు.వివరాలకు సమీప ప్రభుత్వ ఐటీఐల్లో సంప్రదించాలన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో ఈనెల 10వ తేదీన జరిగిన ఎస్జీఎఫ్ ఆర్చరీ పోటీల్లో మాంటిస్సోరికి చెందిన 8వ తరగతి విద్యార్థిని పూజిత ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలోని తన చాంబర్లో డైరెక్టర్ రాజశేఖర్ విద్యార్థినిని అభినందించారు. ఆమె వచ్చే నెల 8, 9 తేదీల్లో విశాఖపట్నంలో జరగనున్న ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీల్లో పతకం సాధించాలని ఆకాంక్షించారు.

విద్యార్థినులు సెల్ఫోన్తో జాగ్రత్తగా ఉండాలి

కర్నూలు(అర్బన్): ఆధునిక సాంకేతికతతో కూడిన సెల్ఫోన్లతో విద్యార్థినులు జాగ్రత్తగా ఉండాలని, ఈ విషయంలో తల్లిదండ్రులు తమ పిల్లలకు తగు సూచనలు ఇవ్వాలని డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శారద సూచించారు. మంగళవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి లీలా వెంకట శేషాద్రి ఆదేశాల మేరకు స్థానిక కలెక్టరేట్ సమీపంలోని ప్రభుత్వ బీసీ బాలికల వసతి గృహంలో 7, 8, 9వ తరగతి విద్యార్థినులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో లీగల్ సర్వీసెస్ యూనిట్ మెంబర్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, న్యాయవాది శ్రీలక్ష్మి, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ శైలజ పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీసీపీఓ శారద మాట్లాడుతూ.. అపరిచితులతో జాగ్రత్తగా ఉండాలని, అనుమానం కలిగితే వెంటనే హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్కు సమాచారం అందించాలన్నారు.

వైభవంగా శ్రీకృష్ణ జయంతి




అహోబిలంలో ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: నవనారసింహులు కొలువైన అహోబిలంలో మంగళవారం శ్రీకృష్ణ జయంతి (ఉట్ల పండుగ)ను ఘనంగా నిర్వహించారు. ఉదయం నిత్యపూజల అనంతరం ఉత్సవ మూర్తులు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రహ్లాదవరదస్వాములను కొలువుంచి నవకలశాలతో అభిషేకించి తిరుమంజనం నిర్వహించారు. అనంతరం శ్రీ ప్రహ్లాదవరదుడిని శ్రీ కృష్ణుడిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. రాత్రి ఉత్సవ మూర్తులను ఉత్సవ పల్లకిలో కొలువుంచి వైభవోపేతంగా గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసి కార్యక్రమం ముగించారు. ప్రధానార్చకులు కీడాండి వేణుగోపాల్, మణియార్ సౌమ్యనారాయన్ ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాలు జరిగాయి.

చేప చేప చిక్కవా!

దొర్నిపాడు: ఉన్నట్టుండి కేసీ కెనాల్కు నీటిసరఫరా నిలిచి పోవడంతో స్థానికులు మంగళవారం చేపల వేటకు దిగారు. దొర్నిపాడు శివారులోని 24వ లాక్ వద్ద కాల్వలో వలలు వేస్తూ చేపల వేట సాగించారు. సుమారు 30 కేజీల వరకు చేపలు దొరకడంతో జాలరులు సంబరపడ్డారు. భారీ వర్షాల కారణంగా పంటలను సాగునీరు ప్రస్తుతం అవసరం లేదని సంతజూటూరు వద్ద నీటి సరఫరాను అధికారులు నిలిపి వేశారు. దీంతో కేసీ కెనాల్ వెంట చేపల వేట ముమ్మరం చేశారు. కాగా బుధవారం ఈ కెనాల్కు నీరు రానున్నట్లు అధికారులు తెలిపారు.



కేసీ కెనాల్లో చేపలు పడుతున్న స్థానికులు (ఇన్సెట్) దొరికిన చేపలు

ఉల్లి రైతుకు కన్నీళ్లు



చిన్నవంగలిలోని నల్లాలమ్మ సత్రంలో ఓ రైతు కేపీ ఉల్లి ఆరబెట్టిన దృశ్యం

చాగలమర్రి: రైతులు కష్టపడి పండించిన ఉల్లిగడ్డలను కొనుగోలు చేసే నాథుడు లేడు. దీంతో వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టిన రైతులకు దిక్కుతోచడం లేదు. ఎన్నో ఆశలతో ఈ ఏడాది ఆళ్లగడ్డ నియోజకవర్గంలో బోరుబావుల కింద రైతులు ఉల్లి పంట వేశారు.ఎకరాకు రూ.20 వేలకు పైగా పెట్టుబడి పెట్టారు. అయితే, పంట చేతికి వచ్చిన సమయంలోనే ధర పడిపోయింది. దీనికితోడు ఎడ తెరిపి లేకుండా కురుస్తున్న వానలకు దిగుబడి తడిసిపోయింది. ఈపరిస్థితుల్లో వ్యాపారులు పంట కొనుగోలుకు ముందుకు రావడం లేదని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

గాలికుంటుపై అప్రమత్తం



పాడిగేదెలకు వేస్తున్న టీకాలను పరిశీలిస్తున్న పశుసంవర్ధకశాఖ డీడీ డాక్టర్ రమణయ్య

దొర్నిపాడు: గాలికుంటు వ్యాధి ప్రమాదకరమని పశువులకు సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆళ్లగడ్డ పశుసంవర్ధకశాఖ డీడీ డాక్టర్ డీవీ రమణయ్య పాడిరైతులకు సూచించారు. జాతీయ పశు వ్యాధి నియంత్రణ పథకంలో భాగంగా మంగళవారం గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. ఈ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. గాలికుంటు వ్యాధి సోకినప్పుడు తీవ్రమైన జ్వరం, నీరసం, నోటి నుంచి సొంగ కారడం, చూడిపశువులు ఈసుక పోవడం జరుగుతుందన్నారు. దీంతో పాల ఉత్పత్తి, పనిసామర్థ్యం గణనీయంగా తగ్గిపోయి రైతుకు ఆర్థిక నష్టం జరుగుతుందన్నారు. పాలు తాగే దూడలు చనిపోయే ప్రమాదం కూడా ఉందన్నారు. ప్రస్తుతం పెయ్య దూడ పుట్టేందుకు సూదులు అందుబాటులో ఉన్నాయని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మాములుగా అయితే సూది ధర రూ.500 ఉండేదని ప్రభుత్వం రాయితీ పోను రూ.150 చెల్లిస్తే సరిపోతుందన్నారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ పశుసంవర్ధకశాఖ ఏడీ(ఏహెచ్) డాక్టర్ నాగరాజు, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ చిన్నబాబు, వైద్యబృందం అన్వర్బాషా, సుస్మిత, సుమన, లక్ష్మణచంద్ర, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ





చిన్నవంగలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఓజోన్ పొర అక్షర క్రమంలో విద్యార్థుల ప్రదర్శన, ప్లకార్డులను ప్రదర్శిస్తూ ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

శిరివెళ్ల: పర్యావరణ పరిరక్షణతోనే మానవ మనుగడ సాధ్యమని యర్రగుంట్ల జీటీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇంద్రావతి అన్నారు. మంగళవారం కళాశాలలో ప్రపంచ ఓజోన్ దినోత్సవం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఓజోన్ ప్రకృతి ఇచ్చిన ఓ వరమన్నారు. పొర భూ వాతావరణంలో మనకు రక్షణ కవచమన్నారు. సూర్యుని వచ్చే అతి వేడి కిరణాలను పొర అడ్డుకొని మనల్ని రక్షిస్తుందన్నారు. దాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. దినోత్సవం పురస్కరించుకొని విద్యార్థులు ఓజోన్ పొరపై చేసిన ప్రజెంటేషన్, ఉపన్యాసాలు అబ్బురపరిచాయి. ఈ కార్యక్రమంలో రసాయన అధ్యాపకుడు ఎన్సీసీ కో–ఆర్డినేటర్ ఖాసీం, అధ్యాపకులు పాల్గొన్నారు.

చాగలమర్రి: మండలంలోని చాగలమర్రి జిల్లా పరిషత్ బాలుర, బాలికల, చిన్నవంగలి, మద్దూరు, చింతల చెరువు, గోడిగనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మంగళవారం ప్రపంచ ఓజోన్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నవంగలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్చార్జ్ హెచ్ఎం శ్రీనివాసులు మాట్లాడుతూ ఓజోన్ పొర అనేది భూమి చుట్టూ ఏర్పడిన సహజ కవచమన్నారు. అనంతరం చిత్రలేఖనం, వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గౌస్మోహిద్దీన్, రుతమ్మ, నాగేంద్రకుమార్, సుబ్బారెడ్డి, వెంకటరామిరెడ్డి, హరిబాబు, పీడీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఓజోన్ పొరపై విద్యార్థులకు అవగాహన

నంద్యాల(న్యూటౌన్): ప్రపంచ ఓజోన్ పొర పరిరక్షణ దినాన్ని పురస్కరించుకుని మంగళవారం నంద్యాల పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళ మాట్లాడుతూ ఓజోన్ పొరను కాపాడుకోకపోతే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. కాలుష్యాన్ని నివారించేందుకు మొక్కలను విరివిగా పెంచాలన్నారు. అనంతరం విద్యార్థులకు ఆన్లైన్లో క్విజ్ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీహరి, అధ్యాపకులు శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న రైతు నాయకుడు రామచంద్రుడు

నంద్యాల(న్యూటౌన్): మొక్కజొన్న కొనుగోలుకు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రామచంద్రుడు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏపీ రైతు సంఘం మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం ఖరీఫ్, రబీ సీజన్లో పండించిన వరి, మొక్కజొన్న, మినుము, మిరప, పొగాకు పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు భారీగా నష్టపోయారన్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్లో సాగు చేసిన పంటలకు ఎకరాకు రూ.35 వేల వరకు పెట్టుబడి పెట్టారని, పదిరోజుల్లో మొక్కజొన్న పంట కోతలు ప్రారంభమవుతాయన్నారు. ఎకరాకు రూ.25 నుంచి రూ.30బస్తాల వరకు దిగుబడి వస్తుందని, ప్రభుత్వం మద్దతు ధర రూ.2400 ప్రకటించి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే రైతులు నష్టపోవాల్సి వస్తుందన్నారు. అలాగే అక్టోబర్ 11, 12 తేదీల్లో ఆత్మకూరులో జరిగే రైతు సంఘం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. సభలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా నాయకులు శ్రీనివాసరెడ్డి, నాయకులు గౌస్ కృష్ణ, మహేంద్రతో పాటు వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి



జగనన్న లేఅవుట్లలో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న పీడీ శ్రీహరి గోపాల్

చాగలమర్రి: లబ్ధిదారులు గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ పీడీ శ్రీహరి గోపాల్ చెప్పారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో హౌసింగ్ ఏఈ, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వర్క్ ఇన్స్పెక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో వివిధ దశల్లో నిర్మాణాల్లో ఉన్న గృహాలను లబ్ధిదారులతో మాట్లాడి త్వరిత గతిన పూర్తి చేయించాలన్నారు. అనంతరం కస్తూరిబా గాంధీ విద్యాలయం సమీపంలోని జగనన్న లేఅవుట్లలో నిర్మిస్తున్న పక్కా గృహాలను పరిశీలించారు. కార్యక్రమంలో స్థానిక ఏఈ నవీన్, వర్క్ ఇన్స్పెక్టర్లు ఓబులేసు, సుబ్బరామయ్య సిబ్బంది సలీం తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలి మృతి



వృద్ధురాలి మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ

ఉయ్యాలవాడ : మండల కేంద్రం ఉయ్యాలవాడలో అనుమానాస్పద స్థితిలో ఓ వృద్ధురాలు మృతి చెందిన సంఘటన మంగళవారం వెలుగు చూసింది. ఎస్ఐ రామిరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన రామక్కగారి సుశీలమ్మ(65) సోమవారం రాత్రి మృతి చెందినట్లు పేర్కొన్నారు. ఈమెకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. ఇద్దరికి వివాహమైంది. ఈమె భర్త చిన్న సుబ్బారెడ్డి సుమారు 15 సంవ్సరాల క్రితం మృతి చెందాడు. కుమారుడు వెంకట సుబ్బారెడ్డి చెన్నైలో ఒక ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. రెండు రోజులుగా సుశీలమ్మ ఇంటి తలుపు తీయకపోవడంతో చుట్టు పక్కల ఉన్న వారికి అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం అందజేశారు. ఎస్ఐ రామిరెడ్డి ఇంటి వద్దకు వెళ్లి పరిశీలించగా మంచంపై విగత జీవిగా పడి వుంది. ముక్కు, చెవులలో నుంచి రక్తం కారిన ఆనవాళ్లు కనిపించాయి. ఈ విషయాన్ని కుమారుడు, కుమార్తెకు తెలియజేయగా తమ తల్లి మృతిపై విచారణ చేపట్టాలని ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసుకుని సుశీలమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మంగళవారం ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్ఐ స్పష్టం చేశారు.

యువతి అదృశ్యం

నంద్యాల(అర్బన్): నంద్యాల మండలం బ్రాహ్మణపల్లె గ్రామానికి చెందిన 22ఏళ్ల యువతి మేకల నాగేశ్వరి అదృశ్యమైనట్లు రూరల్ పోలీసులు తెలిపారు. నాలుగు మాసాల క్రితం వివాహమైన నాగేశ్వరి భర్తతో విభేదించి ఇటీవల బ్రాహ్మణపల్లెకు చేరింది. తండ్రి ఆదిశేషు మందలించడంతో మంగళవారం ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఈ మేరకు యువతి తండ్రి ఫిర్యా దుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అట్టహాసంగా జూడో ఎంపిక పోటీలు



పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు



జిల్లా స్థాయిలో ఎంపికైన క్రీడాకారులు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ఇండోర్స్టేడియంలో మంగళవారం జిల్లా స్థాయి స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జూడో ఎంపిక పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ఎంఈఓలు శివరాంప్రసాద్, బ్రహ్మంనాయక్, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి రాజు, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీలు విశ్వనాథ్, మహిళా సెక్రటరీ ఆశాజ్యోతి పాల్గొని మాట్లాడారు. అండర్–14, 17 బాల, బాలికల విభాగాల్లో నిర్వహించిన ఈ పోటీలకు 250 మంది క్రీడాకారులు హాజరైనట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను రాష్ట్రస్థాయికి పంపడం జరుగుతుందని తెలిపారు. క్రీడాకారులందరికీ గురురాజ విద్యాసంస్థల అధినేత దస్తగిరిరెడ్డి ఆధ్వర్యంలో భోజన వసతి కల్పించారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ చైర్మన్ సుధాకర్, పొన్నాపురం హెచ్ఎం ఐజయ్య, ఫిజికల్ ఎడ్యుకేషన్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు ఏపీరెడ్డి, నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజుతో పాటు వ్యాయామ ఉపాధ్యాయులు చంద్రావతమ్మ, గోపీనాయక్, రత్నకుమార్, నిర్మల, లక్ష్మి, భారతి, జిల్లా జూడో కోచ్ శాంతరాజు, షహనాజ్, తదితరులు పాల్గొన్నారు.

25న కవి సమ్మేళనం

నంద్యాల(వ్యవసాయం): జిల్లా ముస్లిం రచయితల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 25న తెలుగు, ఉర్దూ, హిందీ, భాషల్లో కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ముస్లిం రచయితల సంఘం అధ్యక్షుడు ఎండీ రఫీ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకొని ప్రవక్త జీవిత విశేషాలు అనే అంశంపై తెలుగు ,హిందీ, ఉర్దూ, మధ్యమాల్లో కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నూనెపల్లెలోని నవభారత్ హైస్కూల్లో జరిగే ఈ కార్యక్రమంలో ఆసక్తి కలిగిన కవులు, రచయితలు, సాహితీవేత్తలు పాల్గొనవచ్చునన్నారు. వివరాలకు సెల్: 9949731408, 9533249717లకు సంప్రదించాలని సూచించారు.

ఇంజినీర్లకు సన్మానం

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ఆవోపా కార్యాలయంలో సముద్రాల మధుసూదనరావు అధ్యక్షతన మంగళవారం ఇంజనీర్స్డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పది మంది ఇంజనీర్లను సన్మానించారు. కార్యక్రమంలో ఆవోపా జిల్లా అధ్యక్షుడు ఆత్మకూరు సుబ్రమణ్యం, గౌరవాధ్యక్షుడు వీజీకే మూర్తి, కార్యదర్శి జనార్ధన్, కోశాధికారి చెంచయ్య, విద్యానిధి అధ్యక్షుడు సురేష్, ఉమామహేశ్వర్, విద్యాసాగర్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తికి జైలు శిక్ష

నంద్యాల(వ్యవసాయం): అదనపు కట్నం కోసం భార్యను వేధించి ఆమె ఆత్మహత్యకు కారణమైన భర్తకు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి తంగమణి మంగళవారం తీర్పు వెలువరించారు. వివరాలు.. ముద్దాయి కనకం కృష్ణయ్య నంద్యాలకు చెందిన గోపాల్ కూతురు రాజేశ్వరిని 2006లో వివాహం చేసుకున్నారు. కొన్నేళ్లుగా వీరి కాపురం సాఫీగానే సాగింది. తర్వాత రాజేశ్వరిని అదనపు కట్నం కోసం వేధించడం మొదలుపెట్టారు. ఈ వేధింపులు భరించలేక మృతురాలు జీవితంపై విరక్తి చెంది 2023 మార్చి 4వ తేదీన స్వగ్రామమైన కొలిమిగుండ్ల మండలం చింతలాయిపల్లె ఆత్మహత్య చేసుకుంది. ఈ మేరకు మృతురాలి తండ్రి నంద్యాల గోపాల్ ఫిర్యాదుతో కొలిమిగుండ్ల పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిపై ఇరువురి వాదనలు విన్న జడ్జి ముద్దాయి కృష్ణయ్యకు ఏడేళ్ల జైలు శిక్ష, రూ. నాలుగు వేలు జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు.

గుండెపోటుతో రైల్వే ఎస్ఐ మృతి

డోన్ టౌన్ : స్థానిక రైల్వే స్టేషన్లో ఆర్పీఎఫ్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న లక్ష్మణ్నాయక్ (57) గుండె పోటుతో మృతి చెందారు. మంగళవారం గుంతకల్లు డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్త డోన్ రైల్వే స్టేషన్లో జరుగుతున్న అమృత్ స్టేషన్ పథకం పనుల పరిశీలనకు వచ్చారు. విధులకు హాజరైన ఎస్ఐ.. డీఆర్ఎం పర్యటన ముగిసిన తరువాత స్టేషన్కు వెళ్లే క్రమంలో మెట్లను ఎక్కబోతూ అకస్మాత్తుగా కిందపడి పోవడాన్ని గమనించిన రైల్వే సిబ్బంది రైల్వే ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారని సిబ్బంది తెలిపారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న ఏపీటీఎఫ్ నాయకులు

నంద్యాల(న్యూటౌన్): ఉపాధ్యాయులు సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామచంద్రారెడ్డి, శివయ్య అన్నారు. ఉపాధ్యాయుల సమస్యలపై మంగళవారం ఆ సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఆ నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు దాటినా ఉపాధ్యాయులకు రావాల్సిన సరెండర్ లీవ్, డీఏ బకాయిలు, ఆర్థికపరమైన సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల్లో కూటమి ప్రభుత్వంపై అసంతృప్తి పెరిగిపోతుందన్నారు. పెండింగ్లో ఉన్న నాలుగు డీఏలను తక్షణమే విడుదల చేయాలని, సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కన్వీనర్ భాస్కరరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు జాకీర్హుసేన్, వీరేశ్వరరెడ్డి, దస్తగిరిబాషా, తిమ్మారెడ్డి, శ్రీనివాసులు, వెంకటరామిరెడ్డి, రమాబాయి, తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయం లాభదాయకం



నానో కంపెనీ ఉత్పత్తులు చూపుతున్న రైతులు, అధికారులు



నానో యూరియాపై అవగాహన కల్పిస్తున్న ఏఓ

నంద్యాల(అర్బన్): రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతుల్లో లాభదాయకమని జిల్లా వనరుల కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు చెన్నయ్య తెలిపారు. రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ద్వారా పంటల సాగు చేపట్టాలన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని పాండురంగాపురం, చాపిరేవుల గ్రామాల రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక ఎరువులు వాడకం వల్ల భూములు చవుడు బారి భూసారం నశిస్తుందన్నారు. దీంతో పంట దిగుబడులపై ప్రభావం పడుతుందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏఓ వెంకటేశ్వరరెడ్డి, వ్యవసాయాధికారి ప్రసాదరావు, ఏఈఓలు బాల లింగమయ్య, శ్రీధర్, రైతు సేవా కేంద్రం సిబ్బంది మౌనిక, సాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

నానో యూరియాను వినియోగించుకోవాలి

దొర్నిపాడు: రైతులంతా నానో యూరియాను పంటలకు ఉపయోగించుకోవాలని దాని వల్ల ఎలాంటి నష్టం లేదని మండల వ్యవసాయాధికారి ప్రమీల సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం దొర్నిపాడులో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె నానోఎరువుల వినియోగంపై అవగాహన కల్పించారు. అలాగే రసాయన ఎరువులను పంటలకు మోతాదుకు మించి వాడరాదన్నారు. పెట్టుబడులు తగ్గించి లాభాల దిశగ అడుగులు వేయాలని రైతులకు సూచించారు.

చాగలమర్రి: మండలంలోని పెద్ద బోధనం, నేలంపాడు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయాధికారి రంగ నేతాజి పాల్గొని రైతులకు పంటల సాగు, భూసారంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఓ మంజుల, రేవతి గ్రామ సహాయకులు పాల్గొన్నారు.

కుమారస్వామికి విశేష పూజలు



కుమారస్వామి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో మంగళవారం ఆలయ అధికారులు, అర్చకులు విశేష క్రతువులు నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకం, సుబ్రహ్మణ్య, అష్టోత్తరం అనంతరం స్తోత్ర పారాయణలు చేశారు. సుబ్రహ్మణ్యస్వామి అభిషేకంలో స్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

నందీశ్వరునికి ప్రత్యేక పూజలు

శ్రీశైలమహాక్షేత్రంలోని స్వామిఅమ్మవార్ల ఆలయ ప్రాంగణంలోని శనగన బసవన్నగా పేరుపొందిన నందీశ్వరునికి, శ్రీశైలక్షేత్రపాలకునిగా ప్రసిద్ధిగాంచిన బయలు వీరభద్ర స్వామికి మంగళవారం సందర్భంగా శాస్త్రోక్తంగా ఆలయ అధికారులు, అర్చకులు విశేష పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రదోషకాల సమయంలో క్షేత్రపాలకుడైన వీరభద్రునికి, నందీశ్వరునికి పంచామృతాలతో అభిషేకాది అర్చనలు నిర్వహించారు. ఆరంభ పూజల్లో భాగంగా లోక క్షేమాన్ని కాంక్షిస్తూ సంకల్పాన్ని పఠించారు. కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు గణపతి పూజ చేశారు. అనంతరం నందీశ్వర స్వామికి నూతన వస్త్రసమర్పణ విశేషార్చనలను, నానబెట్టిన శనగలను, క్షేత్రపాలకునికి ప్రత్యేక నైవేద్యాన్ని సమర్పించి కర్పూర నీరాజనాలు అర్పించారు.